చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం



ఇన్‌స్పెక్టర్‌ను సన్మానిస్తున్న జుర్కీ రాజేందర్ తదితరులు

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన గోపికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు జుర్కీ రాజేందర్, పి.శ్రీనివాస్ గౌడ్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ..స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.మల్లికార్జున్‌గౌడ్, రవి, రాహుల్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గోల్కొండ: నానల్‌నగర్‌లోని ప్రీమియర్ ఆసుపత్రి మూడు దశాబ్దాలకు పైగా పేద, మధ్య తరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ ప్రజాదరణ పొందిందని ఆసుపత్రి మెనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మహేష్ మర్దా అన్నారు. శనివారం ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ శణ్ముక్, డాక్టర్ అహ్మద్ మోహియుద్దీన్, డాక్టర్ నబీల్, డాక్టర్ నవాజ్, డాక్టర్ అశ్రా, మార్కెటింగ్ జనరల్ మేనేజర్ ఆర్.శ్రీనివాసులు తదితరులున్నారు.

జనగణనతో అన్ని వర్గాలకు న్యాయం



డాక్టర్ వెన్న ఈశ్వరప్ప

అఫ్జల్‌గంజ్: జనగణనలో కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడంతో ఎస్సీ, ఎస్టీ బీసీలకు ఎంతో న్యాయం జరుగుతుందని తెలంగాణ బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెన్న ఈశ్వప్ప పేర్కొన్నారు. దేశ చరిత్రలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకున్న ఈ నిర్ణయం 140 కోట్ల ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. శనివారం తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కేంద్రంలో ఒక్కసారి కూడా కులగణన చేపట్టలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కులగణన చేపట్టడం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు కేంద్రప్రభుత్వ పథకాలు పుష్కలంగా లభిస్తాయని ఈశ్వరప్ప అన్నారు.

మాసబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రవీణ్‌కుమార్




నాంపల్లి: మాసబ్‌ట్యాంక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఎ.ప్రవీణ్‌కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుంచి మాసబ్‌ట్యాంక్‌కు వచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణకు శక్తి వంచన లేకుండా పనిచేస్తానని, ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు.

టప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్‌గా అభిలాష్



విజయనగర్‌కాలనీ: టప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్‌గా బి.అభిలాష్ బాధ్యతలు చేపట్టారు. ఇతను ఇప్పటి వరకు ఇదే పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం ఉండాలన్నారు. ఇప్పటివరకు ఇక్కడ బాధ్యతలు నిర్వహించిన ఇన్‌స్పెక్టర్ ఎ.రాములు నల్లకుంట పీఎస్‌కు డీఐగా బదిలీ అయ్యారు.

నేడు బసవ జయంతి భవ్య శోభాయాత్ర



జియాగూడ: ఈ నెల 4న 892వ బసవ జయంతిని పురస్కరించుకొని భవ్య శోభాయాత్రను నిర్వహిస్తున్నట్లు రాష్ట్రీయ బసవదళ్ తెలంగాణ ఇతర సంఘాల ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం బసవ మండప్ వద్ద మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం వరకు స్వాగత కార్యక్రమం అనంతరం 5 గంటలకు జియాగూడ బసవ మండప్ నుంచి భవ్య శోభాయాత్ర ప్రారంభం అయ్యి జియాగూడ మెయిన్‌రోడ్డు, పురానాపూల్, జుమ్మేరాత్ బజార్, ఎంజే మార్కెట్, రాత్రి 9 గంటలకు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేరుకుంటుందన్నారు. చివరగా బహిరంగ సభ ఉంటుందన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. కోట దర్వాజాలు శిథిలం

● చారిత్రక కట్టడాల సంరక్షణ గాలికి ● రక్షణ కరువైన గోల్కొండ కోట దర్వాజాలు ● కోటలోని కార్యాలయానికే పరిమితమైన అధికారులు

గోల్కొండ: గోల్కొండ కోట ప్రహరీ తలుపులు అధికారుల నిర్లక్ష్యానికి బలైపోతున్నాయి. ప్రహరీ గోడలకు ఉన్న జమాలి దర్వాజా, బంజారి దర్వాజా, మోతీదర్వాజా, ఫతేదర్వాజా, మక్కై దర్వాజాలు ప్రధానమైనవి. ఈ దర్వాజాల గుండా గోల్కొండ కోటకు ప్రతినిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అధికారుల నిర్లక్ష్యంతో తలుపు రెక్కలు శిథిలావస్థకు చేరుకున్నాయి. గోల్కొండ కోట చుట్టూ ఉన్న చారిత్రక ప్రదేశాల పరిరక్షణ కోసం గోల్కొండ కోటలో కేంద్ర పురాతత్వ సర్వేక్షణ శాఖ వారి సీనియర్ పరిరక్షణ అధికారి కార్యాలయం ఉంది. మందిమార్బాలంతో ఉన్న ఈ కార్యాలయం పేరుకు మాత్రమే అని పలువురు ఆరోపిస్తున్నారు.

కోట లోపలి వ్యవహారాలకే పరిమితం..

కోట ప్రహరీ చుట్టూ ఉన్న కందకాలు కేంద్ర ప్రభుత్వంచే రక్షిత ప్రాంతాలుగా ప్రకటించబడిన కట్టడాలు, స్థలాలు, ప్రహరీ దర్వాజాల నిర్వహణను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. కోట లోపలి వ్యవహారాలు చూసుకోవడంలోనే వీరు పరిమితమైపోతున్నారు. మూడేళ్ల క్రితం భారీ వర్షానికి మోతీదర్వాజా తలుపు రెక్క రాత్రి సమయంలో కూలింది. కూలిన తలుపు రెక్కను మళ్లీ నిలబెట్టి అధికారులు చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం కోట నుంచి రాందేవ్‌గూడ వైపు వెళ్లే మార్గంలో ఉన్న మక్కై దర్వాజా తలుపు రెక్కలు మాత్రం మిగతా దర్వాజాల కంటే మెరుగ్గా ఉన్నాయి. ఈ దర్వాజా ఆర్టిలరీ సెంటర్ జవాన్‌లు రక్షణ ఇస్తుండడంతో ఇది కొద్దిగా మెరుగ్గా ఉంది.

కొరవడిన జవాబుదారి తనం...

కేంద్ర ప్రభుత్వ పురాతత్వ సర్వేక్షణ శాఖ అధికారుల్లో జవాబుదారి తనం కొరవడింది. దర్వాజాలను ఆనుకొని ఉన్న ప్రహరీలను కబ్జాదారులు కబ్జా చేసుకుంటున్నారు. మరో వైపు జమాలిదర్వాజా వద్ద ఉన్న గోల్కొండ కందకంలో టన్నుల కొద్ది వ్యర్థాలు ప్రతినిత్యం డంపింగ్ అవుతున్నాయి. బంజారి దర్వాజా, మోతీదర్వాజా తదితర ప్రాంతాల్లోని కందకాల్లో బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి. 15 ఏళ్ల క్రితం దుర్గానగర్ కందకంలో కబ్జాదారులు గుడిసె వేసి కబ్జా చేశారు. ప్రస్తుతం గుడిసె స్థానంలో పక్కా ఇళ్లు వెలిశాయి. అప్పట్లో అధికారులు నోటిసులు ఇచ్చి వదిలేశారు. చారిత్రక కట్టడానికి రక్షణ లేకుండా పోయిందని చరిత్ర ప్రేమికులు అంటున్నారు. ఏదేమైనా అధికారులు నిర్లక్ష్య ధోరణి ఇలాగే కొనసాగితే ఎన్నో చారిత్రక ప్రదేశాలు కనుమరుగవడం ఖాయం.



ఎండావానాకు శిథిలమైన గోల్కొండ జమాలిదర్వాజా తలుపు రెక్క



శిథిలమవుతున్న మోతీదర్వాజా తలుపు రెక్క

అధికారుల నిర్లక్ష్యమే కారణం



గోల్కొండ కోట అధికారుల నిర్లక్ష్యం కారణంగానే చారిత్రక కందకాలు కనుమరుగవుతున్నాయి. అంతే కాకుండా కోట ప్రహరీలు కూడా కబ్జాకు గురవుతున్నాయి. మరో వైపు కోటకు వచ్చే పర్యాటకులు సైతం గోల్కొండ కోట కాకుండా ఇతర చారిత్రక ప్రదేశాలను చూడకుండాపోతున్నారు. చారిత్రక కందకాలు, ప్రదేశాలు కబ్జాలకు గురికావడం అధికారుల నిర్లక్ష్యమే కారణం.

-మహ్మద్ ఫహాద్, టోలిచౌకీ



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

గౌలిపురా: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి అన్నారు. గౌలిపురా డివిజన్‌లోని కామాక్షమ్మ ఆలయం హనుమాన్‌నగర్ వద్ద శనివారం రూ.6.50 లక్షలతో నూతన సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..బస్తీల్లో శిథిలావస్థకు చేరుకున్న రోడ్డుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని తన దృష్టికి తీసుకురావడంతో జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. నిధులను మంజూరు చేయడంతో నూతన సీసీ రోడ్డు పనులను ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్తీ పెద్దలు జి.నర్సింగ్ రావు, ఎ.ప్రభాకర్ దాస్, నాని, గౌలిపురా డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఇ.సుమన్ కుమార్‌ముదిరాజ్, బీజేపీ నాయకులు జి.రఘుకాంత్, జమాల్‌పూర్ అశోక్, కె.రాజ్ కుమార్, దాస్, ఎస్.రవి, నర్సింగ్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేస్తాం



సేవా సమితి సమావేశంలో సాయిబాబాచారి

గోల్కొండ: పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంచేస్తామని సేవా సమితి అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారి అన్నారు. శనివారం రిసాలబజార్‌లో సేవా సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చేపట్టాల్సిన సేవా కార్యక్రమాల గురించి చర్చించి నిర్ణయం తీసుకున్నారు. అనంతరం శ్రీకాంత్‌చారి మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థులు చదువును మధ్యలో ఆపి వేయకుండా వారికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని వారి సంఘం మాజీ అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి, మహంకాళి అమ్మవారి ఆలయ పూజారి సురేష్‌చారి, న్యాయవాది వాణిశ్రీ తదితరులున్నారు.

యువతకు శాస్త్రీయ కళలపై మక్కువ కల్పించాలి



ఉషా గాయత్రిని సన్మానిస్తున్న జస్టిస్ రాధారాణి తదితరులు

గన్‌ఫౌండ్రీ: యువతకు శాస్త్రీయ కళలపై మక్కువ కల్పించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రాధారాణి అన్నారు. శనివారం రవీంద్రభారతిలో నృత్య కిన్నెర సంస్థ ఆధ్వర్యంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత మద్దాలి ఉష గాయత్రి 70వ జన్మదినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృదేవోభవ పేరుతో నిర్వహించిన కూచిపూడి నృత్య రూపకం ఆహుతును ఆకట్టుకుంది. ప్రముఖ గాయని శ్రీవల్లి శర్మకు మద్దాలి ఉష గాయత్రి తల్లిదండ్రుల పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజాల తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ దేవసేన, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, నృత్య కిన్నెర కార్యదర్శి మద్దాలి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటాలకు పాలాభిషేకం



కార్వాన్‌లో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు



గోపిశెట్టి ప్రమోద్ ఆధ్వర్యంలో..



పాలాభిషేకం చేస్తున్న ఉమా మహేందర్ తదితరులు

జియాగూడ: దేశ అభివృద్ధి లక్ష్యంగా ప్రధాని మోదీ కృషి చేస్తున్నాడని బీజేపీ రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడు గోపిశెట్టి ప్రమోద్ అన్నారు. శనివారం గోషామహల్ నియోజకవర్గంలో దేశ ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న జనగణమనలో కులగణన కూడా చేపడతామని ప్రకటించడం హర్షనీయమన్నారు.

కార్వాన్ కేసరి హనుమాన్ ఆలయం వద్ద..

గోల్కొండ: బీజేపీ కార్వాన్ డివిజన్ అధ్యక్షుడు ఉద్దడి జగదీష్‌కుమార్ ఆధ్వర్యంలో కార్వాన్ కేసరి హనుమాన్ ఆలయం వద్ద శనివారం ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జగదీష్‌కుమార్ మాట్లాడుతూ..దేశమంతటా జనగణనతో పాటు కులగణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం ఒక గొప్ప విషయమన్నారు. ఏదేమైనా ప్రధాని సమర్థ పాలనలో దేశం నెంబర్ వన్‌గా రూపుదిద్దుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్, డిజ్జుర్‌సింగ్, శివరత్నం, నిరంజన్‌బాబు, కట్ట నర్సింగ్‌రావు, కట్ల అశోక్, గంజి రఘునాథ్, వివిధ మోర్చాల నాయకులు పాల్గొన్నారు.

పురానాపూల్ దర్వాజా వద్ద..

చార్మినార్: ప్రధాని నరేంద్ర మోదీ శాస్త్రీయంగా కులగణన చేపట్టేలా చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు ఉమామహేందర్ అన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన పురానాపూల్ దర్వాజా వద్ద శనివారం నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కులాల వారీగా సమాచారం సేకరించి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందించి, బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సురేందర్, నరేందర్, కునాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గో భక్తుల సమ్మేళనం

సుల్తాన్‌బజార్: గోమాతను కొంతమంది అక్రమ రవాణా చేస్తూ గో మాంసం భుజిస్తూ హిందువుల మనోభావాలను గాయపరుస్తున్నారని వారికి వ్యతిరేకంగా ఆదివారం 4న నారాయణగూడలోని కేశవ మెమోరియల్ కళాశాల భవనంలో గో భక్తుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు గో రక్ష సహా ప్రముఖ్ జి.రమేష్‌బాబు, ప్రాంత కార్యదర్శి నేలూరి శ్యామ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సకల దేవతల సరూపం గోమాత అని అలాంటి గోమాత మాంసాన్ని ముద్దలుగా మార్చి విదేశాలకు ఎగుమతి అవుతుందన్నారు. అందుకనే గోమాత రక్షణకే గో భక్తుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమ్మేళనానికి పెద్ద ఎత్తున గో భక్తులు, హిందూ బంధువులు అందరు అధిక సంఖ్యలో పాల్గొని ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విజయదేవర కొండపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

సుల్తాన్‌బజార్: సినీహీరో విజయ దేవరకొండ గిరిజనులను కించపరిచేలా మాట్లాడడం సరైందని కాదని ఆయనపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని నవోదయ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్ పటేల్ డిమాండ్ చేశారు. శనివారం హైదర్‌గూడలో ఆయన మాట్లాడుతూ..హీరో సూర్య నటించిన రెట్రో సినిమా ఆడియో విడుదల కార్యక్రమానికి హాజరైన విజయ దేవరకొండ గిరిజనులను కించపరిచేలా వ్యాఖ్యానించడం ఎంతవరకు సమంజసమన్నారు.

గృహిణి అదృశ్యం



యశోద

నాంపల్లి: ఓ గృహిణి అదృశ్యమైన ఘటన హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ..కర్ణాటక రాష్ట్రానికి చెందిన వి.శివకుమార్ కుమారుడు వి.కిరణ్‌కుమార్, అదే ప్రాంతానికి చెందిన యశోద(20)తో 2022లో వివాహమైంది. ఉపాధి కోసం నగరానికి వచ్చి బోయిగూడ కమాన్ దగ్గర ఉంటున్నారు. వీరిద్దరూ కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నారు. ఈ కారణంగా తిరిగి సొంతూరు వెళ్లడానికి నిశ్చయించుకున్నారు. ఇందులో భాగంగానే ఇంటిని ఖాళీ చేయడానికి సిద్ధమయ్యారు. సామాన్లను కూడా ప్యాకింగ్ చేసి ఉంచారు. శుక్రవారం సొంతూరుకు వెళ్లే సమయంలో శివకుమార్ భార్య కనిపించకుండా పోయింది. భార్య కోసం ఎక్కడ వెతికినా ఫలితం లేకుండా పోవడంతో కిరణ్‌కుమార్ హబీబ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్‌వోసీ అందజేత



చాంద్రాయణగుట్ట: డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఆర్‌ఎస్ లలితాబాగ్ డివిజన్ అధ్యక్షుడు జమ్మిచెట్టు రాజు అన్నారు. లలితాబాగ్‌కు చెందిన పోతర్ల జగదీష్‌యాదవ్ న్యూరో సర్జన్ చికిత్స కోసం ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారు. విషయం తెలుసుకున్న జమ్మిచెట్టు రాజు సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించడంతో రూ.2.5 లక్షల ఎల్‌ఓసీ మంజూరయ్యింది. ఇందుకు సంబంధించిన ప్రతిని అయన కుమారుడికి శనివారం అందజేశారు.

సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా మహమ్మద్ ఆసిఫ్



సంతోష్‌నగర్: సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా శనివారం మహమ్మద్ ఆసిఫ్ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన ఇ. నరసింహ నాయక్ భవానీనగర్ పోలీస్‌స్టేషన్ డీఐగా బదిలీ కావడంతో కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న మొహమ్మద్ ఆసిఫ్‌ను నియమిస్తూ నగర పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శనివారం ఆయన స్టేషన్‌లో బాధ్యతలను స్వీకరించారు.

ప్రజా సేవకే జీవితం అంకితం



బొగ్గారపు దయానంద్‌ను సత్కరిస్తున్న ఎస్ఆర్ లక్ష్మణ్‌రావు

అబిడ్స్: ప్రజా సేవకు జీవితం అంకితమని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ పేర్కొన్నారు. 30 ఏళ్లకు పైగా ప్రజా జీవితంలో నిరంతరం ప్రజా సేవ చేస్తూ సమాజ సేవకు అంకితమైనట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్ లక్ష్మణ్‌రావు ఆయనను ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బొగ్గారపు దయానంద్ మాట్లాడుతూ..తరచూ పేద, బడుగు వర్గాలకు సేవలు చేసి జీవితాంతం సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు.

రోడ్డుపైనే పార్కింగ్.. అయినా పట్టదా..?



పంజగుట్ట మెరిడియన్ హోటల్ ముందు అక్రమ పార్కింగ్

బంజారాహిల్స్: పంజగుట్ట చౌరస్తాలోని మెరిడియన్ హోటల్ వద్ద అక్రమ పార్కింగ్‌తో నిత్యం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అక్రమ పార్కింగ్ తొలగించాలంటూ స్థానికులు, వాహనదారులు ఎన్నిసార్లు కోరుతున్నా పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఈ హోటల్ ముందు ఉన్న ఫుట్‌పాత్‌ను సదరు హోటల్ యాజమాన్యం పూర్తిగా కబ్జా చేసింది. పార్కింగ్‌తో రోడ్డంతా ఇరుగ్గా మారిపోవడంతో పాటు ఫ్రీ లెఫ్ట్ వెళ్లాల్సిన వారు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నారు. అమీర్‌పేట వైపు నుంచి పంజగుట్ట చౌరస్తాకు వచ్చే ఈ రోడ్డులో పాదచారులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. ఆ ప్రాంతంలో రోడ్డుపై నడుస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులతో పాటు వాహనదారులు కోరుతున్నారు.

కొత్త పొదుపు సంఘాల ఏర్పాటుకు సన్నాహం

చాంద్రాయణగుట్ట: కొత్తగా స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రీసోర్స్ పర్సన్‌ల ద్వారా సర్వే నిర్వహిస్తున్నామని చాంద్రాయణగుట్ట సర్కిల్ యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ కరుణాకర్ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..సర్కిల్‌లో కొత్తగా 868 పొదుపు సంఘాలను ఏర్పాటు చేసేందుకు సీఓలు, ఆర్‌పీలతో సర్వే చేస్తున్నట్లు వెల్లడించారు. ఓటరు లిస్ట్ ఆధారంగా పోలింగ్ స్టేషన్ల వారీగా ఇంటింటికీ వెళ్లి కొత్త సభ్యులను గుర్తించాలని సూచించారు. రూ.2 లక్షల వరకు ఆదాయం కలిగిన అన్ని వర్గాల మహిళలను గుర్తిస్తున్నామన్నారు.

భవానీనగర్ డీఐగా నర్సింహా నాయక్



గౌలిపురా: భవానీనగర్ పోలీస్‌స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఇ.నర్సింహా నాయక్ శనివారం బాధ్యతలు చేపట్టారు. సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఇ.నర్సింహా నాయక్‌ను భవానీనగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేస్తూ నగర పోలీసు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన శనివారం స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు.

సయ్యద్ ముఖర్రం నియాజ్‌కు పదోన్నతి

నాంపల్లి: హైదరాబాద్ రహదారులు, భవనాల శాఖ (సెంట్రల్ విభాగం)లో సహాయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేసే సయ్యద్ ముఖర్రం నియాజ్‌కు పదోన్నతి లభించింది. ప్రమోషన్ ప్యానెల్ కింద జరిగిన పదోన్నతుల్లో భాగంగా సీనియారిటీ జాబితా ప్రకారం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (టెక్నికల్)గా పదోన్నతిపై మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. సయ్యద్ ముఖర్రం నియాజ్ హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కవి రవూఫ్ ఖలీష్ చివరకు కుమారుడు. తండ్రి వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న కుమారుడు ఆధునిక కథ రచనలో రాణిస్తున్నారు.

న్యాయవృత్తిలో రాణించాలంటే నైపుణ్యం తప్పనిసరి



హార్మనీ ఇన్ డిస్ప్యూట్స్ కార్యక్రమంలో అతిథులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-3లోని సుల్తాన్-ఉల్-ఉలూమ్ కాలేజ్ ఆఫ్ లాలో 'హార్మనీ ఇన్ డిస్ప్యూట్స్' అంశంపై రెండు రోజుల పాటు జరిగిన పోటీలు శనివారం ముగిశాయి. వర్ధమాన న్యాయ నిపుణుల్లో వివాద పరిష్కార పద్ధతులను ప్రోత్సహించడమే లక్ష్యంగా సాగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయ కళాశాలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. న్యాయవృత్తిలో రాణించాలంటే ఎప్పటికప్పుడు నైపుణ్యం పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం న్యాయ విభాగ డీన్ విజయలక్ష్మీ, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లా, ఐపీఆర్ చైర్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ జీబీ రెడ్డి, సుల్తాన్-ఉల్-ఉలూమ్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి జాఫర్ జీవీద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోటీ విజేతలను అతిథులు సత్కరించి అవార్డులను ప్రదానం చేశారు. ఉత్తమ మధ్యవర్తిగా అవుటి రాగిణి(పెండేకాంతి లా కాలేజ్), రన్నరప్‌గా మహాసిన్ ఫాతిమా(ఇక్ఫాయ్ లా స్కూల్), ఉత్తమ మధ్యవర్తి జంటగా లీనాశర్మ, నౌరీన్ ఫాతిమా(ఇక్ఫాయ్ లా స్కూల్), రన్నరప్‌గా లక్కా శృతి, ట్వింకిల్ మేరీ సైమన్(కేశవ్ మోరియల్ కాలేజ్ ఆఫ్ లా) నిలిచారు.